సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 20 । జూన్ । 2024



తగ్గిన చీనీ ధర
చీనీ ధర క్రమక్రమంగా తగ్గుతోంది. బుధవారం అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.33 వేలు పలికాయి.



అరచేతిలో వాతావరణం
సాంకేతిక అందుబాటులోకి వచ్చాక వాతావరణ సమాచారం ఒక్క మీటనొక్కితే తెలిసిపోతోంది. ప్రభుత్వం కూడా మొబైల్‌కే ముందస్తు సమాచారం పంపుతోంది. 8లో

గరిష్టం/కనిష్టం
35.2°/22.7°
జిల్లాలో బుధవారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గాలివేగం తగ్గడంతో ఉక్కపోత పెరిగింది.

బాబ్బాబు మమ్మల్ని తీసుకోండి!

☛ మడకశిర ప్రాంతానికి చెందిన ఓ ఎంపీడీఓ ఎన్నికలకు ముందు చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఇప్పుడు ప్రభుత్వం వెనక్కు పంపుతుండటంతో మడకశిర నియోజకవర్గం లోనే అనుకూలమైన చోట పోస్టింగ్ కోసం నియోజకవర్గానికి చెందిన టీడీపీ కీలక నేత వద్ద తెలిసిన వారితో పైరవీలు చేస్తున్నారు. పోస్టింగ్ ఇస్తే చెప్పినట్లు నడుచుకుంటానని చెబుతున్నారు.

☛ ఎన్నికల సమయంలో హిందూపురం నియోజకవర్గంలో పనిచేసిన ఓ ఎస్‌ఐ... తిరిగి అక్కడే కొనసాగేందుకు స్థానిక టీడీపీ నేతల ద్వారా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. టీడీపీ నేతల మద్దతుతో ఎమ్మెల్యేతో చెప్పించుకొని అక్కడే ఉండేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

☛ కదిరి నియోజకవర్గంలో తహసీల్దార్‌గా పనిచేసి ఎన్నికల ముందు చిత్తూరు జిల్లాకు వెళ్లిన ఓ అధికారి.. ఇప్పుడు మళ్లీ కదిరి నియోజకవర్గంలోనే పనిచేసేందుకు టీడీపీ నాయకుల ద్వారా పైరవీలు చేస్తున్నారు. అయితే ఎమ్మెల్యే బిజీగా ఉన్నాడని .. తప్పక పోస్టింగ్ ఇప్పిస్తామన్న సంకేతాలు ఇచ్చారు.

☛ పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయంలో పనిచేసే అధికారి ఒకరు ఎన్నికల ముందు బయటి ప్రాంతానికి బదిలీపై వెళ్లారు. ఇప్పుడు మళ్లీ పాత స్థానానికే వచ్చేందుకు స్థానిక టీడీపీ నాయకుల ద్వారా మంత్రి వద్ద పైరవీలు చేయిస్తున్నారు. కానీ మళ్లీ చూద్దామని మంత్రి దాట వేసినట్లు సమాచారం.



- ప్రభుత్వం మారడంతో పోస్టింగ్‌ల కోసం ప్రారంభమైన పైరవీలు
- ఎమ్మెల్యేల ఇంటి చుట్టూ వివిధ శాఖల అధికారుల ప్రదక్షిణలు
- ఎన్నికల వేళ బదిలీ అయిన తహసీల్దార్లు, ఎంపీడీఓలు వెనక్కి
- నూతన పోస్టింగ్ కోసం నేతలను ప్రసన్నం చేసుకుంటున్న అధికారులు
- ఆదాయం వచ్చే స్థానాల కోసం భారీగా లాబీయింగ్

సాక్షి, పుట్టపర్తి/పుట్టపర్తి టౌన్/హిందూపురం అర్బన్: కొత్తగా కొలువుదీరిన కూటమి ప్రభుత్వం శాఖల ప్రక్షాళన, అధికారుల బదిలీలపై దృష్టి సారించింది. కీలకమైన శాఖల్లో తమ వారిని నియమించుకునేందుకు స్థానిక ప్రజా ప్రతినిధులు పావులు కదుపుతున్నారు. నియోజకవర్గ, మండల స్థాయిల్లో నాయకులు కూడా తాము చెప్పినట్లు నడుచుకునే అధికారులు, ఉద్యోగులను నియమించుకోవడంపై దృష్టి సారించారు. ఇప్పటికే మండలాల వారీగా జాబితాలు సైతం సిద్ధం చేస్తున్నారు.

ఉద్యోగుల్లోనూ మొదలైన హడావుడి..
ప్రభుత్వ ఉద్యోగుల్లోనూ హడావుడి మొదలైంది. గత ప్రభుత్వ హయాంలో బదిలీలపై ఇక్కడికి వచ్చిన వారు తిరిగి తమ జిల్లాలకు వెళ్లేందుకు తెర వెనుక ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. తమకు తెలిసిన వారి ద్వారా నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేలను కలుస్తూ మంచి స్థానాలకు వెళ్లేందుకు విజ్ఞప్తులు చేస్తున్నారు. బదిలీ సిఫార్సుల కోసం మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్ల వద్ద క్యూ కడుతున్నారు. త్వరలోనే అసెంబ్లీ సమావేశాలు ఉండటంతో ఆ తరువాత చూద్దామంటూ ప్రజాప్రతినిధులు తిప్పిపంపుతున్నట్లు తెలుస్తోంది.

అప్పుడే బేరసారాలు..
కొందరు ప్రజాప్రతినిధులు ఇదే అదునుగా భావించి పోస్టుకు ఇంత అని బేరం మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. తహసీల్దార్, ఎంపీడీఓ, ఎస్‌ఐ, సీఐ, సీడీపీఓ పోస్టులతో పాటు, విద్యుత్, వైద్య శాఖల్లో పైరవీలు జరుగుతున్నాయి. కొందరు సామాజిక వర్గాన్ని అస్త్రంగా చేసుకుని ముందుకు వెళుతున్నారు. ప్రధానంగా హిందూపురం, ధర్మవరం, పెనుకొండ, కదిరి ప్రాంతాలు, చుట్టు పక్కల మండలాలకు బయటి ప్రాంతాల నుంచి డిమాండ్ ఎక్కువగా ఉండటం.. ఎమ్మెల్యేలు ఎలాంటి హామీ ఇవ్వక పోవడంతో వారి అనుయాయుల ద్వారా పావులు కదుపుతున్నారు.

ఎమ్మెల్యే ఇళ్ల వద్దకు పోలీసుల క్యూ..
జిల్లా పోలీస్ శాఖలోనూ బదిలీలపై తీవ్రస్థాయిలో చర్చ సాగుతోంది. ప్రస్తుతం కొనసాగుతున్న డీఎస్పీలు, కీలక సర్కిళ్లలో కొనసాగుతున్న అధికారులకు బదిలీలు తప్పవని కూటమి ప్రజాప్రతినిధులు సంకేతాలు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులంతా ఎమ్మెల్యేల ఇళ్లవద్దకు క్యూ కడుతున్నారు. కొత్తగా ఎంపికైన ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. మరికొందరు మాత్రం.. ప్రజాప్రతినిధుల సమీప బంధువులు, అనుకూల వ్యక్తులతో టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పార్టీకి వీర విధేయులుగా పనిచేసిన అధికారులు ఇప్పుడు 'మర్యాద' పేరుతో ప్రజాప్రతినిధులను కలుస్తున్నట్లు సమాచారం.

వారు వద్దంటే వద్దు..
గత ప్రభుత్వ హయాంలో తమను ఇబ్బంది పెట్టిన పోలీస్ అధికారులకు సిఫార్సు లేఖలు ఇవ్వవద్దని నియోజకవర్గ స్థాయి నేతలు ప్రజాప్రతినిధులకు చెబుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఎన్నికల వేళ ఇతర జిల్లాలకు బదిలీ అయిన పోలీసులు కూడా ఇప్పుడు జిల్లాలో పోస్టింగ్ కోసం ప్రయత్నిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. కాగా, ఆయా ఎమ్మెల్యేలు వారి సామాజిక వర్గాలకు పెద్దపీట వేస్తున్నట్లు సమాచారం. మరికొందరు ఉన్నతాధికారులు ఏకంగా మంత్రులను మర్యాద పూర్వకంగా కలుస్తున్నట్లు తెలుస్తోంది.

వివాదాస్పద స్థానాలకూ డిమాండ్..
జిల్లా పరిధిలో కొన్ని పోలీస్ స్టేషన్లు, రెవెన్యూ కార్యాలయాలు వివాదాలకు కేరాఫ్‌గా ఉన్నాయి. అలాంటి స్థానాలకు వెళ్లేందుకు చాలామంది ఆసక్తి చూపుతుండటం విశేషం. మరోవైపు ఎక్సైజ్ విభాగంలో ఎలాంటి మార్పులు చేసుకుంటాయోనని.. ఆ శాఖ ఉద్యోగులు గాబరా పడుతున్నారు. ఇంకోవైపు అధికార పార్టీ నేతలు.. తమకు నచ్చిన అధికారి కావాలని నాయకుల వద్ద పంచాయితీలు చేస్తున్నారు. ఫలానా అధికారి అయితే బాగుంటుందని సూచిస్తున్నారు.

న్యూస్‌రీల్

29న మెగా లోక్ అదాలత్
- విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి బొజ్జప్ప పిలుపు


మాట్లాడుతున్న న్యాయమూర్తి బొజ్జప్ప

పెనుకొండ: మెగా లోక్ అదాలత్ ఈనెల 29న నిర్వహించనున్నామని, ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని లోక్ అదాలత్ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి బొజ్జప్ప పేర్కొన్నారు. పట్టణంలోని కోర్టు ఆవరణంలో బుధవారం న్యాయమూర్తులు న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి బొజ్జప్ప మట్లాడుతూ 29న జరిగే మెగా లోక్ అదాలత్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని, దీన్ని దృష్టిలో ఉంచుకుని న్యాయవాదులు తమ పరిధికి సంబంధించిన కక్షిదారులతో మాట్లాడి రాజీకి అనువుగా ఉన్న కేసులను మెగా లోక్ అదాలత్‌లో ప్రవేశపెట్టి కేసులు రాజీ చేసేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో న్యాయమూర్తులు వాసుదేవన్, సయ్యద్ ముజీబ్ పసలుల్లా, ఏజీపీ భాస్కర రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

'సుమతి'కి బెస్ట్ టీచర్ అవార్డు


రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న డాక్టర్ సుమతి

మడకశిర రూరల్: స్థానిక వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సుమతికి బెస్ట్ టీచర్ అవార్డు దక్కింది. బుధవారం బాపట్ల ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 56వ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ఆమె అవార్డు అందుకున్నారు. సుమతి భర్త కృష్ణమోహన్‌రెడ్డి కూడా మడకశిర మండలం కల్లుమర్రి ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్నారు. సుమతికి రాష్ట్రస్థాయి అవార్డు రావడంతో కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా సిరాల


సిరాల చంద్ర

హిందూపురం: గ్రామ, వార్డు సచివాలయాల ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ (రి.నెం:138/2020) రాష్ట్ర కార్యదర్శిగా సిరాల చంద్ర ఎంపికయ్యారు. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జానీపాషా బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. హిందూపురంలోని వార్డు సచివాలయంలో సంక్షేమ కార్యదర్శిగా పనిచేస్తున్న సిరాల చంద్ర ఎంపికపై స్థానిక సచివాలయ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర కోర్ కమిటీ సమావేశంలో తన ఎంపికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు, ఇతర సభ్యులకు ఈ సందర్భంగా చంద్ర ధన్యవాదాలు తెలిపారు.

ఎస్కేయూ రెక్టార్‌గా వెంకట నాయుడు


ప్రొఫెసర్ వెంకట నాయుడుకు నియామక పత్రం అందజేస్తున్న వీసీ హుస్సేన్ రెడ్డి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నూతన రెక్టార్‌గా ప్రొఫెసర్ జి. వెంకట నాయుడు నియమితులయ్యారు. వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కే. హుస్సేన్ రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య బుధవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో వెంకట నాయుడు రెక్టార్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు. వీసీ హుస్సేన్ రెడ్డి, రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య అభినందించారు. వర్సిటీ పురోగతికి శాయశక్తులా కృషి చేస్తానని వెంకటనాయుడు పేర్కొన్నారు. వెంకటనాయుడు ఎకనామిక్స్ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్. బోధన, పరిశోధనలో అపారమైన అనుభవం గడించారు. స్థూల అర్థశాస్త్రం, అగ్రికల్చర్ ఎకనామిక్స్ రంగంలో పేరుగాంచారు. ఇప్పటివరకూ 24 జర్నల్స్ ప్రచురించారు. 21 అంతర్జాతీయ కాన్ఫరెన్సుల్లో ప్రసంగించారు. 5 పీహెచ్‌డీ అవార్డులు ఈయన పర్యవేక్షణలో అందజేశారు.

అవగాహనతోనే 'సికిల్ సెల్' నివారణ


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

- అంతర్జాతీయ 'సికిల్ సెల్ డే' ర్యాలీ ప్రారంభోత్సవంలో కలెక్టర్

పుట్టపర్తి అర్బన్: అవగాహనతోనే సికిల్ సెల్ వ్యాధిని నివారించవచ్చని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. 2047 నాటికి ఈ వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ సికిల్ సెల్ డే సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ, గిరిజన సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ నుంచి ఎనుములపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకూ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల్లోని 0- 40 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారికి అవగాహన కల్పించడం, రక్త పరీక్షలు నిర్వహించడం, కౌన్సెలింగ్ నిర్వహించడమే సికిల్ సెల్ అనీమియా నిర్మూలన మిషన్ ప్రధాన ఉద్దేశమన్నారు. సికిల్ సెల్ వ్యాధి గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు జూన్ 19న ప్రపంచ సికిల్ సెల్ అవేర్‌నెస్ డేని పాటిస్తున్నట్లు వెల్లడించారు. హిమోగ్లోబిన్ తక్కువ ఉన్న వారికి ఈ వ్యాధి వస్తుందన్నారు. దీనిని నిరోధించడానికి స్క్రీనింగ్ టెస్టులు ప్రారంభించినట్లు తెలిపారు. సకాలంలో వ్యాధిని గుర్తించడం ద్వారా చికిత్సను వెంటనే ప్రారంభించడానికి వీలుంటుందన్నారు. వ్యాధి తీవ్రంగా మారకుండా నిరోధించడమే ఉత్తమ మార్గమన్నారు.

రక్తకణాల సంఖ్య తగ్గుతుంది..
డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి మాట్లాడుతూ, సికిల్ సెల్ వ్యాధి బాధితుల్లో రక్త కణాల సంఖ్య తగ్గుతుందన్నారు. అలాగే కళ్లు పసుపు రంగులోకి మారడం, తీవ్రమైన ఒళ్లు నొప్పులు, శ్వాస తీసుకోవడంతో ఇబ్బంది, అలసట ఉంటుందన్నారు. అలాగే తరచూ అంటు వ్యాధుల బారిన పడతారని, మహిళల్లో గర్భధారణ సమస్యలు వస్తాయన్నారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే సమీప పీహెచ్‌సీల్లో ఒక చుక్క రక్తం ఇచ్చి నిర్ధారణ చేయించుకోవచ్చన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే హైడ్రాక్సీ యూరియా, ఫోలిక్ యాసిడ్ మాత్రలు ఇస్తారన్నారు. అత్యవసరమైతే రక్తం ఎక్కించాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ అధికారి మోహన్‌రామ్, పలువురు వైద్యాధికారులు పాల్గొన్నారు.

22 మండలాల్లో వాన
- హిందూపురం, మడకశిరలో అత్యధికం


లేపాక్షిలో వర్షపు నీటితో నిండిన కుంట

పుట్టపర్తి అర్బన్: నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం ఉదయం వరకూ జిల్లాలోని 22 మండలాల పరిధిలో వర్షం కురిసింది. అత్యధికంగా హిందూపురం మండలంలో 74.6 మి.మీ, మడకశిర మండలంలో 68.4 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇక కొత్తచెరువు 41.2, లేపాక్షి 36.8, అమరాపురం 30.4, బుక్కపట్నం 24.2, పరిగి 22.4, చిలమత్తూరు 18.6, తనకల్లు 18.4, గుడిబండ 15.2, ఎన్పీ కుంట 12.8, నల్లచెరువు 12.4, అమడగూరు 9.6, నల్లమాడ 9.4, సీకేపల్లి 7.8, రొళ్ల 6.4, గోరంట్ల 6.2, రామగిరి 4.8, పుట్టపర్తి 4.2, రొద్దం మండలంలో 3.4 మి.మీ వర్షపాతం నమోదైంది. మరో రెండు రోజులు జిల్లాకు వర్ష సూచన ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

ప్రకృతి వ్యవసాయం బాగుంది


ప్రకృతి వ్యవసాయ విధానాన్ని తెలుసుకుంటున్న జాంబియా దేశస్తులు

- జాంబియా దేశ ప్రతినిధి బృందం కితాబు

బత్తలపల్లి: ప్రకృతికి మేలు చేయడంతో పాటు రైతుకు మేలు చేసే ప్రకృతి వ్యవసాయం చాలా బాగుందని జాంబియా ప్రతినిధి బృందం కొనియాడింది. ఉమ్మడి అనంతపురం డీపీఎం లక్ష్మణ్ నాయక్ ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి 19 తేదీ వరకు జాంబియా దేశానికి చెందిన ప్రతినిధి బృందానికి ప్రకృతి వ్యవసాయంపై క్షేత్రస్థాయి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ క్రమంలో బుధవారం జాంబియా ప్రతినిధి బృందం మండలంలోని బత్తలపల్లి, గంటాపురం, రాఘవంపల్లి గ్రామాల్లో పర్యటించింది. ఈ సందర్భంగా రైతు సాధికార సంస్థ మెంటర్ సుకన్య, ఎస్ఎఫ్ ఎల్-1 నరసింహులు తదితరులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను వారికి వివరించారు. ఘన జీవామృతం తయారీ, ఉపయోగాలు, నీమస్త్రం తయారీ విధానం, ఉపయోగాలు, ఏటీఎం మోడల్ షోవింగ్, డీఆర్పీ మోడల్ షోవింగ్, విత్తన గుళికల తయారీ విధానం, ఏ-గ్రేడ్ మోడల్ షోయింగ్ విధానం తదితర వాటి గురించి తెలిపారు. పెట్టుబడి తక్కువ కావడంతో పాటు విష రసాయనాలు లేని దిగుబడులిచ్చే ప్రకృతి వ్యవసాయాన్ని తమ దేశ రైతులూ చేపట్టేలా అవగాహన కల్పిస్తామని జాంబియా ప్రతినిధి బృందం తెలిపింది. కార్యక్రమంలో ఎంసీఆర్పీలు రాధమ్మ, పార్వతి, ముత్యాలప్ప, ఐసీఆర్పీఎస్ నగేంద్రమ్మ, గంగమ్మ, అమృత రాణి, లీలావతి, అశ్విని, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడులు దక్కలేదు.. ఆదుకోండి

- 'ఉపాధి'ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలి
- కరువు నివారణకు శాశ్వత పరిష్కారం చూపేందుకు సిఫార్సు చేయాలి
- కేంద్ర బృందానికి జిల్లా రైతుల విన్నపం



రొద్దం మండలం కొట్టాల వద్ద మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

రొద్దం: తీవ్ర వర్షాభావంతో గత రబీ సీజన్‌లో పంటలు పూర్తిగా నష్టపోయామని, పెట్టుబడులు కూడా దక్కలేదని కేంద్ర బృందానికి రైతులు తెలిపారు. మానవతా దృక్పథంతో మెరుగైన సాయం అందించాలని కోరారు. బుధవారం మండలంలోని ఆర్ కొట్టాల, చెరుకూరు గ్రామాల్లో కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీ రితేష్‌చౌహాన్, ఆయిల్‌సీడ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.పొన్నుస్వామి, అగ్రికల్చర్ అండ్ ఫార్మర్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ సునీల్‌దుబేతో కూడిన కేంద్ర బృందం (ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం) పర్యటించింది. తొలుత ఆర్.కొట్టాల గ్రామంలో వారు పర్యటించి రైతులతో ముఖాముఖి అయ్యారు. భూగర్భ జల మట్టం, పప్పుశనగ పంట నష్ట విస్తీర్ణం, పశువర్ధక శాఖ, డెయిరీ నిర్వహణ తదితర అంశాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు శిద్దన్న మాట్లాడుతూ, తాను రెండు ఎకరాల్లో పప్పుశనగ సాగు చేయగా, రూ 25 వేల మేర పెట్టుబడి అయ్యిందన్నారు. చేతికి మాత్రం రూ 2 వేలు వచ్చిందన్నారు. తనలాగే మండలంలోని పలువురు రైతులు నష్టపోయారని, పెట్టుబడులు కూడా చేతికందలేదని వివరించారు. పప్పుశనగ పూర్తి సబ్సిడీతో అందజేసి రైతులను ఆదుకోవాలని కోరారు.


హాజరైన రైతులు

శాశ్వత పరిష్కారం చూపాలి..
రైతు చిన్నగువ్వలపల్లి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని కోరారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలన్నారు. పంట నష్టానికి పరిహారంతో పాటు, నిత్యం కరువు బారిన పడే ఈ ప్రాంతానికి శాశ్వత పరిష్కారానికి నిధులు కేటాయించే విధంగా కేంద్రానికి సిఫార్సులు చేయాలని కోరారు. పశువర్ధక శాఖ, వ్యవసాయం, ఆర్‌డబ్ల్యూఎస్, ఉపాధి తదితర అంశాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్, సబ్‌కలెక్టర్ అపూర్వభరత్, డీఏఓ సుబ్బారావు, డీహెచ్‌ఓ చంద్రశేఖర్, ఏడీఏ స్వయంప్రభ, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టీబీ డ్యాంకు తగ్గిన ఇన్‌ఫ్లో


తుంగభద్ర జలాశయం

బొమ్మనహాళ్: కర్ణాటకలోని హొస్పేట వద్ద ఉన్న తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో తగ్గింది. బుధవారానికి 749 క్యూసెక్కులకు పడిపోయింది. రాయచూర్‌కు సంబంధించిన లెఫ్ట్ బ్రాంచ్ మెయిన్ కెనాల్ (ఎల్‌బీఎంసీ)కు 1,620 క్యూసెక్కులు, రాయబసవన కాలువకు 116, జిందాల్ 1 కూసెక్కులతో కలిసి 1,710 క్యూసెక్కుల నీటిని వదులుతుండడంతో డ్యాంలో నీటిమట్టం 5.887 టీఎంసీలకు తగ్గింది. 105.788 టీంఎసీల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన డ్యాంలో ప్రస్తుతం 5.887 టీఎంసీల నీరు ఉంది.

నిండుతున్న గాజనూరు (తుంగ) జలాశయం..
కర్ణాటకలోని శివమొగ్గ జిల్లాలో కొన్ని రోజులుగా ఆశాజనకంగా వర్షాలు కురుస్తుండడంతో టీబీ డ్యాం ఎగువన 3.10 టీఎంసీల సామర్థ్యంతో ఉన్న గాజనూరు జలాశయం (తుంగ ప్రాజెక్టు)లో నీటి నిల్వ గరిష్ట మట్టానికి చేరుతోంది. నేడో, రేపో జలాశయం గేట్లను ఎత్తే అవకాశం ఉండడంతో దిగువన ఉన్న తుంగభద్ర డ్యాంకు నీరు పరుగున రానున్నాయి. ఎగువన ఉన్న చిక్క మంగళూరు, కొప్పి, శివమొగ్గ, శృంగేరి, వరనాడు, మంగళూరు, తీర్థనహళ్లి తదితర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు అక్కడి వాగులు, వంకలు, నదుల్లో వరద పెరుగుతోంది. తుంగ నుంచి నీరు విడుదలై టీబీ డ్యాం త్వరగా నిండాలని రైతులు కోరుకుంటున్నారు.

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్య

హిందూపురం అర్బన్: స్థానిక మేళాపురంలో నివాసముంటున్న వివాహిత గంగోత్రి(21) ఆత్మహత్య చేసుకుంది. నాలుగేళ్ల క్రితం మడకశిర నియోజకవర్గం కల్లూరు గ్రామానికి చెందిన మధు అనే వ్యక్తితో ఆమెకు వివాహమైంది. ఇటీవల గర్భం దాల్చిన ప్రసవానికి పుట్టింటికి వచ్చింది. అయితే రెండు నెలల క్రితం పురిట్లోనే బిడ్డ మృతిచెందడంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. ఈ క్రమంలో అనారోగ్యం వెన్నాడడంతో జీవితంపై విరక్తి చెంది బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు వన్‌టౌన్ ఎస్ఐ హరూన్‌బాషా తెలిపారు.

రైతులపై ఎలుగుబంటి దాడి

పావగడ: తాలూకాలోని కేటీ హళ్లి గ్రామానికి చెందిన ఇద్దరు రైతులపై ఎలుగుబంటి దాడి చేసి తీవ్రంగా గాయ పరచింది. గ్రామానికి చెందిన రైతులు హుత్తన్న, దాసన్న బుధవారం సాయంత్రం 4 గంటల సమయంలో తమ గేదెలు, మేకలను పొలం నుంచి ఇంటికి తోలుకెళుతుండగా పొదల్లో నుంచి ఒక్కసారిగా ఎలుగుబంటి బయటకు వచ్చి దాడి చేసింది. అతి కష్టంపై దాడి నుంచి తప్పించుకున్న రైతులను స్థానికులు వెంటనే కేటీ హళ్లిలోని పీహెచ్‌సీకి తరలించారు.

ఆర్బీకే తలుపులు ధ్వంసం




ధ్వంసమైన ఆర్బీకే తలుపులు

కదిరి అర్బన్: మండలంలోని కేఎస్ పాళ్యం గ్రామ రైతు భరోసా కేంద్రంపై గుర్తు తెలియని దుండగులు దాడి చేశారు. తలుపులు ధ్వంసమైన విషయాన్ని గుర్తించిన పంచాయతీ కార్యదర్శి, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ బుధవారం ఉదయం ఎంపీడీఓ అంజినప్ప దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సూచన మేరకు మండల వ్యవసాయాధికారికి ఫిర్యాదు చేశారు.

భర్తపై భార్య దాడి

ధర్మవరం రూరల్: స్థానిక శివానగర్‌కు చెందిన చట్ట రవివర్ధన్‌పై భార్య దాడి చేసింది. బాధితుడు తెలిపిన మేరకు... ఎనిమిదేళ్ల క్రితం హిందూపురానికి చెందిన ధనలక్ష్మితో రవివర్ధన్‌కు వివాహమైంది. కొంత కాలంగా మనస్పర్ధలు తలెత్తడంతో దంపతులిద్దరూ విడాకుల కావాలని కోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో ధనలక్ష్మి, ఆమె చెల్లెలు రూప, అమ్మ లక్ష్మీదేవి బుధవారం ఉదయం రవివర్ధన్ ఇంటికి చేరుకుని గొడవపడ్డారు. మాటామాట పెరగడంతో రవివర్ధన్‌పై భార్య దాడి చేసింది. ఘటనలో రవివర్ధన్ కుడి కాలు, ఎడమ చెయ్యి విరిగింది. క్షతగాత్రుడిని కుటుంబసభ్యులు ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్ చేశారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

జీవన యోగం



- 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం
- నేడు యోగా చైతన్య ర్యాలీ

అనంతపురం కల్చరల్/పామిడి: మారుతున్న కాలంలో ప్రతి మనిషి ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ఒత్తిడి. అత్యంత ప్రమాదకరంగా పరిణమిస్తున్న ఈ రుగ్మతను తగ్గించడానికి 'యోగా' ముఖ్యమైన ఔషధంగా మారింది. భారతీయ తత్వశాస్త్రాల్లో షట్‌దర్శనాల్లో న్యాయం, వైశేషికం, వేదాంతం, మీమాంస, సాంఖ్యం తర్వాత యోగం ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది. మనసుపై, శరీరంపై పట్టు సాధించడమే యోగాభ్యాసం అంతిమలక్ష్యమని సాధకులు అంటుంటారు. దేహం, మనసు, భావోద్వేగాలను సమతుల్యం చేయడమే యోగమని విశ్లేషిస్తున్నారు. ఒత్తిడిని తగ్గించి ఆనందకర జీవనానికి తోడ్పడే

సనాతన భారతీయ జీవన విధానంలో భాగమైన యోగ విశిష్టతను తెలియజేసేందుకు ఏటా జూన్ 21న 'అంతర్జాతీయ యోగా దినోత్సవం' జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

మహిళా సాధికారత అంశంపై

ఏటా యోగా దినోత్సవాన్ని ఒక్కో అంశానికి ప్రాధాన్యతనిస్తూ చేస్తుండడం గమనార్హం. ఈ ఏడాది మహిళా సాధికారత అంశంపై యోగా దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ క్రమంలో యోగాపై ప్రజలను చైతన్య పరుస్తూ గురువారం ఉదయం 7.30 గంటలకు అనంతపురంలోని ఆర్ట్స్ కాలేజ్ నుంచి పురవీధుల్లో ర్యాలీ చేపట్టనున్నారు. అలాగే అన్ని యోగా కేంద్రాల సమన్వయంతో శుక్రవారం ఉదయం 6.30 గంటలకు పోలీసు పరేడ్ మైదానంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నారు. అలాగే పామిడిలోనూ గురువారం ఉదయం 10 గంటలకు ర్యాలీ ఉంటుందని యోగా శిక్షకురాలు ఎస్.సంధ్యాదత్తు తెలిపారు. శుక్రవారం ఉదయం 6 నుంచి 6.45 గంటల వరకూ ప్రోటోకాల్ యోగా ఉంటుందన్నారు.

ప్రతి ఆసనం ఉప'యోగ'మే

యోగాభ్యాసం సకల సమస్యలకు పరిష్కారం చూపుతుందని అందరూ విశ్వసిస్తున్నారు. అయితే యోగాభ్యాసంలో భాగంగా సాగే ఒక్కో ఆసనం ద్వారా ఒక్కో ఉపయోగం ఉంటుంది. పూర్ణ ధనురాసన్, చక్రాసన్, వృక్షాసన్, హలాసన్, జాను శీర్షాసన్, పశ్చిమోత్తాసన్, వృష్టాసన్, శలాభసన్, వృశ్చికాసన్ వంటి వాటి వల్ల అభ్యాసకులు రోజంతా ఉత్సాహంగా గడుపుతుండడం గమనార్హం. బీపీ, షుగర్ సమస్యలకు నివారిణిగా ధ్యానం, యోగా పని చేస్తుంది. ధ్యానంతో మనో వికాసం, ఆధ్యాత్మిక జ్ఞానం కలుగుతుంది. తలనొప్పి, వెన్నునొప్పి, మోకాళ్లనొప్పులు, అలసటలాంటి వాటిని దూరం చేసుకోవాలంటే యోగా తప్పనిసరి అని శాస్త్రీయంగా నిరూపితమైంది.

రేపు యోగా దినోత్సవం : కలెక్టర్

అనంతపురం అర్బన్: పదవ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఈనెల 21న ఘనంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. స్థానిక పోలీసు పరేడ్ మైదానంలో శుక్రవారం ఉదయం 6.30 గంటలకు కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. అందరూ పాల్గొని అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



వృక్షాసనం

అందరి భాగస్వామ్యంతో..



చాలా మంది అనారోగ్యంతో బాధపడుతూ వచ్చి యోగ, ధ్యానంతో అన్ని రుగ్మతల నుంచి బయట పడుతున్నారు. నేను కూడా ఇలాగే మెడకు సంబంధించిన నొప్పి అధికమై యోగ కేంద్రంలో అడుగుపెట్టాను. యోగాను మించిన వైద్యం మరేదీ లేదని తెలుసుకున్నా. ఆనందకర జీవితానికి యోగా ఎంతోగానో దోహదపడుతుంది. ఈ విషయంపై అందరి భాగస్వామ్యంతో గురువారం ఉదయం ర్యాలీ నిర్వహిస్తున్నాం. శుక్రవారం యోగా దినోత్సవం జరుపుతున్నాం.

– రాజశేఖరరెడ్డి, వివేకానంద యోగా కేంద్రం అధ్యక్షుడు, అనంతపురం

శ్రేష్టమైన ఆలోచనలతోనే ఆరోగ్యం



శ్రేష్టమైన ఆలోచనలు, విలువలతో కూడిన ఆచరణాత్మక జీవన విధానం మానసిక ఆరోగ్యాన్ని అందిస్తాయి. అదే శారీరక ఆరోగ్యానికి దోహదపడుతుంది. ఇందుకు యోగా, ధ్యానం అవసరం. చిన్నాపెద్ద తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ యోగా అభ్యసిస్తే జీవితం ఎంతో ఆనందంగా సాగుతుంది. ముఖ్యంగా మహిళలు ఎదుర్కొంటున్న అనేక ఒత్తిళ్లు, రుగ్మతలను సహజ సిద్ధమైన ధ్యానం, యోగా ద్వారా పోగొట్టుకోవచ్చు. ఈసారి మహిళలకు ప్రాధాన్యత నిచ్చే ఉమెన్ ఎంపవర్‌మెంట్ పేరుతో యోగా దినోత్సవం సాగడం ఆనందం.

– సిస్టర్ శారదా, బ్రహ్మకుమారీల ఇన్‌చార్జి

మైగ్రేన్ పోయింది



అనంతపురంలోని ఓ ప్రైవేట్ క్లినిక్‌లో నర్సుగా పనిచేస్తున్న నేను కొంత కాలం క్రితం తీవ్రమైన మైగ్రేన్‌తో బాధపడ్డాను. ఎంతమంది డాక్టర్లను సంప్రదించినా నయం కాలేదు. ఆ సమయంలోనే పామిడిలో యోగాభ్యాసం మొదలుపెట్టిన తర్వాత మైగ్రేన్ దూరమైంది.

– నాగలక్ష్మి, ప్రైవేట్ నర్సు, పామిడి

నిరుద్యోగ యువతకు శిక్షణ

ధర్మవరం రూరల్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఎఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో వృత్తి నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఈ మేరకు ఆ సెంటర్ మండల బాధ్యులు కె.దస్తగిరి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతీయువకులకు కంప్యూటర్, టూ వీలర్ మెకానిజం, ఎలక్ట్రికల్, లైట్... హెవీ మోటారు వెహికల్ డ్రైవింగ్, సెల్ ఫోన్ రిపేరీ తదితర అంశాలపై ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. ఈ క్రమంలో ఈ నెల 20న (గురువారం) టూ వీలర్ మెకానిజం బ్యాచ్ ప్రారంభమం కానుంది. ఆసక్తి ఉన్న వారు పూర్తి వివరాలకు 93905 05952లో సంప్రదించవచ్చు.

రైలు పట్టాలపై ఇనుప తీరు

- లోకో పైలెట్ అప్రమత్తతతో యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ప్రమాదం



రైల్వే ట్రాక్‌పై పడి ఉన్న ఇనుప తీరు

ధర్మవరం రూరల్: పట్టణంలోని గాంధీనగర్ రైల్వే అండర్ బ్రిడ్జిపై ఉన్న రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తులు ఇనుప తీరును అడ్డంగా ఉంచారు. లోకో పైలెట్ సంతోష్ అప్రమత్తతతో యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలుకు ప్రమాదం తప్పింది. మంగళవారం రాత్రి 8.20 గంటలకు జరిగిన ఈ ఘటన ఆలస్యంగా బుధవారం వెలుగులోకి వచ్చింది. ఆర్‌పీఎఫ్ సీఐ బోయ కుమార్ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. యశ్వంత్‌పూర్ నుంచి బీదర్‌కు వెళ్లే యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలు మంగళవారం రాత్రి 8.20 గంటలకు ధర్మవరం రైల్వేస్టేషన్‌కు సమీపంలోని గాంధీనగర్ ప్రాంతానికి చేరుకుంది. అండర్ బ్రిడ్జిపై గల రైల్వే ట్రాక్‌కు అడ్డంగా ఇనుప తీరును ఉంచిన దృశ్యాన్ని లోకోపైలెట్ సంతోష్ గమనించాడు. ఎమర్జెన్సీ బ్రేక్ వేసి రైలును ఆపాడు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఇనుప తీరు 8 అడుగుల పొడవు, 15 కిలోల బరువు కలిగి.. తుప్పు పట్టి ఉంది. ఇది రైల్వే ఆస్తి కాదు. ఎవరో ట్రాక్‌కు అడ్డంగా పడేశారు. ఈ ఘటనకు బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

ప్రతి మహిళా కోటీశ్వరురాలు కావాలి



సమావేశానికి హాజరైన మహిళలు



మాట్లాడుతున్న విశాలాఫెర్రర్

బత్తలపల్లి: ఉమ్మడి జిల్లాలోని ప్రతి మహిళా కోటీశ్వరరాలు కావాలన్నదే ఆర్డీటీ ఆశయమని ఆ సంస్థ ఉమెన్స్ సెక్టార్ డైరెక్టర్ విశాలాఫెర్రర్ పేర్కొన్నారు. బత్తలపల్లిలో ఏర్పాటు చేసిన ఉమెన్ కో ఆపరేటివ్ సొసైటీ బ్యాంక్‌ను బుధవారం ఆమె ప్రారంభించారు. అనంతరం ఆర్‌కే ఫంక్షన్ హాలులో రీజినల్ డైరెక్టర్ ప్రమీల అధ్యక్షతన చైతన్య మహిళా పరస్పర సహాయక సహకార పొదుపు పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వంటింటికే పరిమితమైన మహిళలు అవకాశాలు అందిపుచ్చుకుని అసాధారణంగా రాణిస్తూ స్త్రీశక్తిని చాటుతున్నారన్నారు. మహిళలను అన్నిరంగాల్లో కుటుంబ సభ్యులే ప్రోత్సహిస్తున్నారన్నారు. కుటుంబ అవసరాల కోసం ఇతరుల మీద ఆధారపడి ఇబ్బందులు పడ్డ మహిళల కోసమే మహిళా కోఆపరేటివ్ బ్యాంక్ స్థాపించినట్లు తెలిపారు. ఈ బ్యాంక్ ద్వారా రుణాలు తీసుకుని జీవనోపాధులు మెరుగు పరుచుకోవడం ద్వారా సకాలంలో చెల్లిస్తూ ఆదర్శంగా నిలవాలన్నారు. ఇప్పటికే కళ్యాణదుర్గం, కంబదూరు, కూడేరు మండలాల్లో మహిళా కో ఆపరేటివ్ బ్యాంక్‌లు ఏర్పాటు చేశామని, నాల్గవ బ్యాంక్‌ను బత్తలపల్లిలో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని మహిళలకు సూచించారు. కార్యక్రమంలో ఏటీఎల్ రుక్మాంగద, హెచ్‌ఆర్డీ ధనలక్ష్మి, ఉమన్ ఎంపవర్‌మెంట్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విత్తన చట్టం.. మోసాలకు కళ్లెం

- ప్రైవేట్ విత్తన, ఎరువుల దుకాణాల్లో లైసెన్స్ ప్రదర్శన తప్పనిసరి
- ప్రతి కొనుగోలుదారుకూ రసీదు ఇవ్వాల్సిందే



హిందూపురం అర్బన్: ఖరీఫ్ వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఇదే తరుణంలో ప్రైవేట్ ఎరువులు, విత్తనాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఈ క్రమంలో రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని నకిలీ విత్తనాలు అంటగట్టే ముఠాలు లేకపోలేదు. దుకాణంలో ఒక రకమైన విత్తనం ఉంచుకుని రైతులకు మరో రకం విత్తనాలు అంటగట్టే మోసాలకు చెక్ పెట్టేలా విత్తన చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

మోసగిస్తే కఠిన చర్యలు..

విత్తనాలు కొనుగోలు సమయంలో రైతులకు ఎలాంటి అన్యాయం జరిగినా విత్తన చట్టం ద్వారా సంబంధిత విత్తనాల డీలర్లపై కఠినమైన చర్యలు చేపట్టే వీలుంది. విత్తన చట్టం–1966, విత్తన నిబంధనలు–1968, విత్తన నియంత్రణ–1983 చట్టాల ఆధారంగా అతి క్రమణలు, ఉల్లంఘనలు వర్తించేలా చట్టాన్ని రూపొందించారు. విత్తన విక్రయాల్లో మోసాలకు పాల్పడే వారిపై విత్తన నియంత్రణ ఉత్తర్వులు–1983 క్లాజ్3 కింద అతి క్రమించినందుకు ఆయా దుకాణాల్లో విత్తనాలను జప్తు చేయడంతో పాటు అత్యవసర సరుకుల చట్టం 1955 సెక్షన్'ఏ' ప్రకారం జరిమానా విధిస్తారు.

విత్తన లైసెన్స్ ప్రదర్శించాలి..

జిల్లాలో సుమారు 295 ప్రైవేట్ డీలర్ల దుకాణాలు ఉన్నాయి. వీటిలో సుమారు 87 విత్తన విక్రయ డీలర్లు, మిగిలిన దుకాణాల్లో ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తుంటారు. ప్రైవేట్ విత్తన విక్రయ దుకాణాల్లో తప్పని సరిగా విత్తన లైసెన్స్‌లను ప్రదర్శించాలి. విత్తన లైసెన్స్ లేకుంటే ఆయా దుకాణాల్లో విత్తనాల విక్రయాలు చేపట్టరాదు. నోటీసులు ఇచ్చి దానికి సరైన సమాధానం ఇవ్వకపోతే విత్తన నియంత్రణ ఉత్తర్వులు–1983 క్లాజ్ 5 ప్రకారం డీలర్ లైసెన్స్ రద్దు చేయడానికి, సస్పెండ్ చేసేందుకు వ్యవసాయ అధికారులకు పూర్తి అధికారముంది. అలాగే విత్తనాలు విక్రయించే దుకాణాల్లో కచ్చితంగా ధరలు, స్టాకు బోర్డులను ఏర్పాటు చేయాలి. లేకుంటే విత్తన నియంత్రణ ఉత్తర్వులు –1983 క్లాజ్ 8 ప్రకారం ఆయా దుకాణాల్లో విత్తనాల అమ్మకాలు నిలుపుదల చేయవచ్చు. అంతే కాక అధికారులు వారి లైసెన్స్‌లను రద్దు చేయవచ్చు. విత్తనాల కొనుగోలు సమయంలో రైతులకు తప్పని సరిగా దుకాణదారు కచ్చితంగా కొన్న విత్తనానికి రసీదు ఇవ్వాల్సి ఉంటుంది. రసీదు ఇవ్వని పక్షంలో విత్తన నియంత్రణ ఉత్తర్వులు 1983–క్లాజ్ 9 ప్రకారం దుకాణదారునికి నోటీసు ఇచ్చి, సమానధానం లేకపోతే డీలర్ లైసెన్స్ రద్దు చేయవచ్చు. ప్రైవేట్ విత్తనాల వ్యాపారి వద్ద కొనుగోలు చేసిన బస్తాలకు లేబుల్ లేకున్నా... విత్తన చట్టం 1966 సెక్షన్ 7 ప్రకారం జరిమానా విధిస్తారు. కాలం చెల్లిన విత్తనాలు విక్రయిస్తే విత్తన చట్టం 1966 సెక్షన్ 7 ప్రకారం విత్తన నియంత్రణ ఉత్తర్వులు 1983 క్లాజ్ 8ను అనుసరించి డీలర్ లైసెన్స్ రద్దు చేస్తారు.

నిబంధనలు పాటించాల్సిందే



ప్రభుత్వం రూపొందిచన విత్తన చట్టానికి అనుగుణంగా ప్రైవేట్ విత్తనాల డీలర్లు విక్రయాలు చేపట్టాలి. నిబంధనలు అతిక్రమిస్తే భారీ జరిమానాతో పాటు దుకాణాల లైసెన్స్‌లు రద్దు చేసే అవకాశం ఉంది.

– అల్తాఫ్ అలీ ఖాన్, ఏడీఏ, హిందూపురం

కరువు రైతులను ఆదుకోండి



కేంద్ర బృందానికి వినతి పత్రం సమర్పిస్తున్న బీజేపీ నాయకులు

రొద్దం: కరువు కాటకాలతో నష్టపోతున్న రైతాంగాన్ని ఆదుకోవాలని కరువు పరిశీలన కేంద్ర బృందానికి బీజేపీ ప్రతినిధులు విన్నవించారు. బుధవారం రొద్దం మండలంలో పర్యటినిస్తున్న కేంద్ర బృందంతో వారు కలసి మాట్లాడారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎక్కువ వ్యవసాయం భూమి వర్షాధారంపై ఆధారపడి ఉందన్నారు. సత్యసాయి జిల్లాలో 90 శాతం పైగా రైతు వర్షాధారం పంటలతోనే జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ ప్రాంతంలో సకాలంలో వర్షాలు పడకపోవడంతో పంట నష్టాలు వాటిల్లుతున్నాయన్నారు. దీనికి తోడు అకాల వర్షాల కారణంగానూ పంట నష్ట పోతున్నారని వివరించారు. ఈ ప్రాంత ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా రైతులకు న్యాయం చేయాలని కోరారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద కరువు మండలాలకు ప్రత్యేక గుర్తింపు, ఎక్కువ నిధులు కేటాయించేలా చూడలన్నారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సహకాలు అందడం లేదన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా ఆర్గానిక్ స్టేట్ కన్వీనర్ చింతా భరత్‌కుమార్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సమీవుల్లా, మండల అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, హనుమంతు యాదవ్, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అరచేతిలో వాతావరణం

- ప్రత్యేక యాప్‌లు రూపొందించిన కేంద్రం
- గ్రామ పంచాయతీ స్థాయిలోనే వాతావరణం అంచనా
- ఫోన్‌లో ఈ యాప్స్ ఉంటే వర్షం, పిడుగుల సమాచారం
- ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్థితులు తెలుసుకునే సౌలభ్యం



మేఘదూత్ యాప్



రెయిన్ యాప్



దామిని యాప్



వజ్రపాత్ యాప్



ధర్మవరం అర్బన్: వాన రాకడ... ప్రాణం పోకడ... ఎవరికి తెలుస్తుందనేది పాత నానుడి. నేడు శాస్త్ర సాంకేతిక రంగాల్లో సాధించిన ప్రగతితో వర్షం రాకను ముందుగానే పసిగట్టేస్తున్నారు. అదే సమాచారాన్ని మెసేజ్‌ల రూపంలో సెల్‌ఫోన్లకు పంపి మానవాళిని అప్రమత్తం చేస్తున్నారు. భారీ వర్షాలు, పెను గాలులు, పిడుగుపాటు తదితర ప్రకృతి విపత్తుల నుంచి పూర్తిగా బయటపడలేకపోయినా నష్ట శాతం గణనీయంగా తగ్గుతోంది.

వ్యవసాయ, అనుబంధ రంగాలకు ఎంతో ప్రయోజనం..

దేశ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు ప్రాణాధారంగా మారాయి. విత్తు నాటడం మొదలు పంట విక్రయం వరకూ అడుగడుగునా సవాళ్లే. వీటిలో సింహభాగం వాతావరణ పరిస్థితులదే. ఎప్పటికప్పుడు వాతావరణంలో అనూహ్య మార్పులు చోటు చేసుకుంటూ అనుక్షణం సవాళ్లు విసురుతూ ఉంటోంది. వర్షాలు, పెను గాలులు తీవ్ర ఆర్థిక నష్టానికి కారణమవుతుంటాయి. పిడుగుపాటు ప్రమాదాలు రైతులు, వ్యవసాయ కూలీలు, గొర్రెలు, పశువుల కాపర్లు, ఆరుబయట ప్రాంతాల్లో తిరిగే వ్యవసాయ కూలీలను విగత జీవులుగా మారుస్తున్నాయి. పిడుగు పడితే విలువైన పశుసంపద, మహావృక్షాలు, మనుషులు, జంతువుల ప్రాణాలు గాల్లో కలిసిపోతాయి. ఈ కష్టాలకు భారత వాతావరణ విభాగం(ఐఎండీ) తెరదించింది. అందుబాటులోకి తీసుకువచ్చిన ప్రత్యేక యాప్‌ల ద్వారా పిడుగు పడే అవకాశం ముందస్తుగా తెలుసుకునే అవకాశంతో పాటు ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా చూసుకునే వెసులుబాటు ఉంది. గ్రామ పంచాయతీ స్థాయిలోనే వాతావరణం అంచనాలు విడుదల చేస్తోంది. చేతిలో స్మార్ట్‌ఫోన్, ఇంటర్‌నెట్ సౌకర్యం ఉంటే వాతావరణం వివరాలు తెలుసుకుని అప్రమత్తమయ్యే వీలు కల్పిస్తోంది.

వారం ముందే 'మేఘదూత్'..

పంట సాగులో విత్తనం నుంచి ఎరువులు వేసే సమయం, లేదా పంట నూర్పిడి సమయంలో రైతులను నష్టపరిచేది వర్షమే. ఇలాంటి నష్టాల నుంచి బయటపడేందుకు 'మేఘదూత్' యాప్ ఎంతో దోహదపడుతోంది. దీని సాయంతో వారం ముందుగా నాలుగు, ఐదు రోజుల వాతావరణ మార్పులు, వర్షసూచన సహా ఆకాశం మేఘావృతం అవుతుందా? లేదా? గాలులు ఏ దిశ నుంచి ఏ దిశకు వీస్తాయి? తేమ శాతం, ఉష్ణోగ్రత వివరాలు తెలుసుకోవచ్చు. ఈ యాప్ ద్వారా ప్రతి మంగళ, శుక్రవారాల్లో వాతావరణ సమాచారంతో ఆగ్రో మెట్ ఫీల్డ్ యూనిట్ల (ఏఎమ్ఎఫ్‌యూ) సమాచారం రైతుల ఫోన్లకు సంక్షిప్త సమాచారం రూపంలో అందుతుంది.

వర్షాన్ని గుర్తించే 'రెయిన్ అలారమ్'..

గూగుల్ ప్లేస్టోర్ నుంచి రెయిన్ అలారం యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వినియోగదారుడు అందించిన సమాచారం మేరకు అతను ఉండే ప్రాంతానికి చుట్టుపక్కల 20 కి.మీ పరిధిలో ఎక్కడ వర్షం పడే సూచనలున్నాయో ఇట్టే తెలుసుకోవచ్చు. వర్షం ముప్పును ముందే తెలుసుకుని జాగ్రత్త పడే అవకాశం ఉంటుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

మెరుపులను తెలిపే 'దామిని'..

ఎప్పటికప్పుడు మెరుపు హెచ్చరికలను తెలియజేసేందుకు 'దామిని' యాప్ ఉపయోగపడుతుంది. దీని సాయంతో సమీపంలో 20 కి.మీ పరిధిలో ఐదు నుంచి 20 నిమిషాల వ్యవధిలో ఎక్కడ పిడుగు పడే అవకాశం ఉందో అప్రమత్తం చేస్తుంది. మెరుపు ఎందుకు వస్తుంది. మెరుపు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఈ యాప్‌లో వివరించారు. లొకేషన్ ఆధారంగా ఎక్కడెక్కడ మెరుపులు వచ్చే అవకాశముందో సూచిస్తుంది. పిడుగు పడినప్పుడు తోటి వారికి అందించాల్సిన వైద్య సాయం, శ్వాస ఆగిపోతే నోటి నుంచి శ్వాసను అందించడం, గుండె చప్పుడు ఆగిపోతే సీపీఆర్ చేయడం తదితర వివరాలతో పాటు పిడుగు పడినప్పుడు ప్రాథమికంగా చేయకూడనివి, చేయాల్సిన పనులు దీని ద్వారా తెలుసుకోవచ్చు.

పిడుగు సమాచారానికి 'వజ్రపాత్'..

గూగుల్ ప్లేస్టోర్ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్ గుర్తుపై నొక్కితే రెండు రకాల సమాచారం వస్తుంది. ఎడమ వైపు పిడుగు గుర్తు, పిడుగు సమాచారం కనిపిస్తుంది. అక్కడ నొక్కితే మనం ఉన్న ప్రాంతం సహా మ్యాప్ కనిపిస్తుంది. రెడ్, ఆరెంజ్, ఎల్లో కలర్‌లలో వలయాలు కనిపిస్తాయి. వీటి పక్కనే 8, 15, 30 అంకెలుంటాయి. ఈ అంకెల ప్రకారం అంటే కొద్ది సేపట్లో అంత దూరంలో(కిలోమీటర్లలో) పిడుగు పడే అవకాశం ఉందని తెలుస్తుంది. ఎంత దూరంలో పిడుగు పడుతుందో పిన్ రూపంలో స్పష్టత ఇస్తుంది. యాప్ కుడి భాగంలో పిడుగుపాటు హెచ్చరికలు తెలిపే బటన్ ఉంటుంది. యాప్ ఆన్ చేసి ఎప్పటికప్పుడు అప్రమత్తం కావొచ్చు.

ప్రయోజనాలు చాలా

వెదర్ యాప్ అందుబాటులోకి రావడంతో ఎప్పటికప్పుడు వాతావరణ సమాచారాన్ని తెలుసుకునే వీలుంది. విత్తనాలు వేసుకోవడం, పురుగు మందులు పిచికారీ చేయడం, రసాయనిక ఎరువులు వేసుకున్న సమయంలో వర్షం కారణంగా తీవ్రంగా నష్టపోయే ప్రమాదముంది. అయితే వెదర్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవడం ద్వారా వర్ష సూచన ముందుగానే తెలుసుకుని జాగ్రత్త పడవచ్చు.

– క్రిష్ణయ్య, ఏడీఏ, ధర్మవరం